

ఎన్టీఆర్ స్టేడియంలో పేరుకుపోయిన వ్యర్థాలు

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 17 మార్చి 2025 | HYDERABAD

## 48 గంటల మహా ధర్నా

మేడ్చల్, మార్చి 16(నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట 17, 18 తేదీల్లో 48 గంటల పాటు మహా ధర్నా, వంటా వార్పు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునీత, శోభారాణి తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించినా.. స్పందించలేదన్నారు.

## భానుడి భగభగలు

సిటీబ్యూరో, మార్చి 16, (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ 40డిగ్రీలకు చేరువయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 39.2 డిగ్రీలు, కనిష్ఠం 22.7, గాలిలో తేమ 20శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా రానున్న మూడు నాలుగు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

# మేడ్చల్‌లో నీటి గోస..

### అడుగంటిన భూగర్భ జలాలు

### అంతంత మాత్రంగా మిషన్ భగీరథ నీరు
### ట్యాంకర్లే దిక్కు..జోరుగా నీటి వ్యాపారం
### పదేండ్ల తర్వాత సమస్య పునరావృతం

మేడ్చల్, మార్చి 16 : మేడ్చల్‌లో వేసవి ప్రారంభంలోనే నీటి కటకట మొదలైంది. పట్టణంలో ఎటూ చూసినా నీటి ట్యాంకర్లే దర్శనమిస్తున్నాయి. అంతంగా వస్తున్న మిషన్ భగీరథ నీరు.. మండిపోతున్న ఎండలు.. అడుగంటిన భూగర్భ జలాలు.. నీటి పథకం నిర్వహణ లోపాలు వెరసి పదేండ్ల తర్వాత మళ్లీ నీటి ఎద్దడి పరిస్థితులు దాపురించాయి.

### చింత తీర్చిన మిషన్ భగీరథ..

మేడ్చల్ పట్టణంలో మిషన్ భగీరథ నీరు రాక ముందు పరిస్థితి ఎంత దారుణంగా ఉండేది అంటే వేసవికి రెండు నెలల ముందే అంటే జనవరి చివరి వారం నుంచే ట్యాంకర్ల కోసం వేచి చూడాల్సి వచ్చేది. మున్సిపాలిటీకి చెందిన దాదాపు 200 బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసినా.. నీటి అవసరాలు తీరేవి కావు. ప్రైవేట్ ట్యాంకర్ల వ్యాపారం జోరుగా సాగేది. బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్ల నివాసితులు అవసరాల కోసం రోజుకు మూడు, నాలుగు ట్యాంకర్ల వరకు తీసుకునే పరిస్థితి ఉండేది. ప్రతి రోజూ నీటి యుద్ధాలే దర్శనమిస్తుండేవి. బీఆర్‌ఎస్ సర్కారు మిషన్ భగీరథ పథకంలో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీకి రూ.42 కోట్లు ప్రత్యేకంగా వెచ్చించి, మిషన్ భగీరథ నీటిని అందజేసింది. దీంతో నీటి సమస్య శాశ్వతంగా దూరమైంది. దీంతో ట్యాంకర్లు మూలన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక మళ్లీ నీటి కష్టాలు మొదలయ్యాయి. దాదాపు 20 రోజులగా నీటి కటకట మేడ్చల్‌లో ప్రారంభమైంది.

### సరఫరా మెరుగుపర్చకపోతే ధర్నా: ఎమ్మెల్యే మల్లారెడ్డి

మిషన్ భగీరథ నీటి సరఫరా మెరుగుపర్చకపోతే తాను వచ్చి ధర్నా చేస్తానని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అధికారులకు అల్టీమేటం జారీ చేశారు. మున్సిపాలిటీ వాసులు పలువురు నీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తే ఫోన్‌లో అధికారులతో మాట్లాడారు. 'డీఈ గారూ...మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా జరగడం లేదు. కనీసం గంట పాటైనా నీళ్లు ఇవ్వకపోతే ఎలా' అని ప్రశ్నించారు. నీటి సరఫరా మెరుగుపర్చకపోతే తానే వచ్చి ధర్నా చేస్తానని హెచ్చరించారు.



అసలే నీటి కష్టాలుంటే.. మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డులో లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

### నిర్లక్ష్యంతో..

అధికారుల నిర్లక్ష్యం వల్ల నీటి సమస్య తీవ్రమైందన్న విమర్శలున్నాయి. పలుచోట్ల నీటి లీకేజీ అవుతున్నది. మేడ్చల్-కిష్టాపూర్ దారిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవుతున్నది. పైపులైన్ లీకేజీతో నడిరోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి, నీరు మురుగు కాల్వ పాలవుతోంది. అయినా ఇటు మున్సిపాలిటీ గానీ, అటు మిషన్ భగీరథ పథకం అధికారులు పట్టించుకోవడం లేదు. దాదాపు 10 నెలల నుంచి పరిస్థితిని చక్క దిద్దడం లేదు.



మున్సిపాలిటీ ట్యాంకర్‌ద్వారా నీటి సరఫరా

### జోరుగా ట్యాంకర్ల వ్యాపారం

పదేండ్ల తర్వాత ట్యాంకర్ల వ్యాపారం జోరుగా సాగుతున్నది. రోడ్లపై ప్రైవేట్ ట్యాంకర్లు పరుగులు పెడుతున్నాయి. వ్యవసాయ బోర్ల నీటిని ట్యాంకర్లలో నింపి అమ్ముకుంటున్నారు. ఒక్కో ట్యాంకర్ రూ.550 నుంచి రూ.600 పలుకుతున్నది. మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్రనగర్, ఎంఆర్‌ఆర్, కిష్టాపూర్, ఎన్‌జీవోఎస్, కేఎల్‌ఆర్, అత్వెల్లి, బాలాజీనగర్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి ఇంటి బోరు అడుగంటడం, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో ట్యాంకర్లపైనే ఆధార పడుతున్నారు. 10 మంది నివసిస్తున్న భవనానికి ప్రతి రోజూ ఒక ట్యాంకర్‌ను వినియోగిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలు, అపార్టమెంట్ల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఫిబ్రవరి మొదలుకుంటే వర్షాలు పడే జూన్, జూలై వరకు ఒక్కో కుటుంబం ఎంత లేదన్నా నీటి కోసం కనీసం రూ.40 నుంచి రూ.50వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. ప్రైవేట్ ట్యాంకర్లతో పాటు మున్సిపాలిటీ ట్యాంకర్ల కూడా నీటి సరఫరాను ప్రారంభించాయి.

## సాచివేతకు ఒప్పుకోం..

### అప్రజాస్వామిక సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి
### ఓయూలో విద్యార్థి సంఘాల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ప్రదర్శనలు, నిరసనలు నిర్వహించకూడదని అధికారులు జారీచేసిన సర్క్యులర్ పై ఓయూలో ఆగ్రహ జ్వాల వెల్లువెత్తింది. అన్ని విద్యార్థి సంఘాలు ఖండించాయి. ఓయూ వీసీ చర్యలను నిరసిస్తూ వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వామపక్ష, దళిత, గిరిజన, బహుజన, ప్రజాస్వామ్య, అధికార, ప్రతిపక్ష పార్టీల విద్యార్థి సంఘాల నాయకులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సర్క్యులర్‌ను వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నేతలు చటారి దశరథ్, జీడీ అనిల్, జంగయ్య, రాజేశ్ (బీఆర్‌ఎస్వీ), ఎస్.నాగేశ్వర రావు ఆర్.ఎల్ మూర్తి, ఉదయ్ (ఎస్ఎఫ్ఐ) దివాకర్ (ఏఎస్ఏ), శ్రీకాంత్ (ఓయూ జేఏసీ) తదితరులు పాల్గొన్నారు.కాగా, సర్క్యులర్ ప్రతులను ఏబీవీపీ నేతలు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో దహనం చేశారు. ఇదిలాఉంటే విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులు హరించేలా ఉన్న సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగబాలు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండగాని కిరణ్ గౌడ్, బీఆర్‌ఎస్వీ



రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జీడీ అనిల్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేశ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య , జార్జి రెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ నాగేశ్వరరావు, ఆల్ మాలా స్టూడెంట్స్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) – తెలంగాణ స్టేట్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరశురాం తదితరులు డిమాండ్ చేశారు.

### వెనక్కి తగ్గిన ఉన్నతాధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎటువంటి ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించకూడదని అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌పై సర్వత్రా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్న తరుణంలో వర్సిటీ ఉన్నతాధికారులు వెనక్కి తగ్గారు. యూనివర్సిటీ క్యాంపస్ మొత్తం నిరసనలు నిషేధించలేదని స్పష్టం చేశారు.

## వేలం వేయనివ్వం



సిటీ బ్యూరో/కొండాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు కన్నెర్ర చేశారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేయడం సబబేనంటూ విడుదల చేసిన ప్రెస్‌నోట్‌ను శనివారం రాత్రి దహనం చేశారు. కాంగ్రెస్ సర్కారు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా హెచ్‌సీయూ పరిధిలోని ఒక్క ఎకరం భూమిని కూడా అమ్మనీయబోమని తేల్చి చెప్పారు. భూముల వేలం విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గేదాకా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. కాగా, ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

## బల్దియా ఉద్యోగులకు ఆరోగ్య భద్రత ఏదీ!

- హెల్త్ ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేయని యంత్రాంగం
- అనారోగ్యం పాలవుతున్న ఉద్యోగులకు అవస్థలు
- రెన్యువల్ లేక అప్పుల పాలవుతున్న బాధితులు



సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో ఉద్యోగుల భద్రతకు భరోసా కల్పించడంలో యంత్రాంగం విఫలమైంది. సంస్థలో పనిచేసే ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్ గడువు ముగిసి నెల రోజులు కావొస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇన్సూరెన్స్ లేకపోవడంతో అనారోగ్యం పాలవుతున్న ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఓ శానిటేషన్ జవాన్‌కు గుండెపోటు రావడంతో స్థానిక హాస్పిటల్‌కి తరలించారు. 5 లక్షలు అవుతుందని హాస్పిటల్ యాజమాన్యం తేల్చి చెప్పడంతో డబ్బులు కట్టలేక, ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఏం చేయాలో తెలియక ఆ కుటుంబం పడిన బాధలు అన్నీ ఇన్నీ కావు. గడిచిన నెల రోజులుగా వివిధ కారణాలతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మిగతా ఉద్యోగుల పరిస్థితి ఇలాగే ఉందని, సంబంధిత అధికారులు పట్టించుకుని హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుని కొత్త సంస్థకు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. వాస్తవంగా బజాజ్ హెల్త్ ఇన్సూరెన్స్ గడువు గత ఫిబ్రవరి 14తో ముగిసింది. జీహెచ్‌ఎంసీ నుంచి ప్రీమియం కట్టకపోవడంతో రెన్యువల్ కాలేదు. కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ టెండర్లను పిలుస్తామని చెబుతున్నారే తప్ప..ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. అధికారుల కాలయాపనతో అనారోగ్యానికి గురవుతున్న ఉద్యోగులకు హాస్పిటల్స్‌లో డబ్బులు కట్టలేక, వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 2019 నుంచి హెల్త్ ఇన్సూరెన్స్..

2019 నుంచి జీహెచ్‌ఎంసీలో పనిచేసే ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారు. ఉద్యోగులకు అప్పటి కమిషనర్ లోకేశ్‌కుమార్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకొచ్చారు. మొదట 3 లక్షల వరకు ఆ తర్వాత 5 లక్షల వరకు కవర్ అయ్యేలా చేశారు. ప్రస్తుతం బజాజ్ హెల్త్ ఇన్సూరెన్స్ సరిగా పని చేయడం లేదని, కొన్ని హాస్పిటల్స్ అంగీకరించడం లేదని ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

### ఉద్యోగులు ఆసుపత్రి పాలు

ఇటీవల శానిటేషన్ జవాన్‌కు హార్ట్ ఎటాక్ రావడంతో ఖైరతాబాద్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. నాలుగు స్టంట్స్ వేయాలని, ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని హాస్పిటల్ వర్గాలు శానిటేషన్ జవాన్ ఫ్యామిలీకి తెలిపారు. తమకు హెల్త్ ఇన్సూరెన్స్ ఉందని హాస్పిటల్ వారికి ఇస్తే.. ఇది ఎక్స్ పైర్ అయింది కాబట్టి చెల్లదు.. మొత్తం డబ్బులు కడితేనే చికిత్స చేస్తామని చెప్పారున. దీంతో ఏం చేయాలో తెలియక అప్పు చేసి ఇబ్బందులు పడిన పరిస్థితి. మరి కొందరు ఉద్యోగులు వివిధ అనారోగ్య సమస్యలపై ఆసుపత్రి పాలయ్యారు. ఇలా వరుసగా కమిషనర్, అడ్మిన్ అడిషనల్ కమిషనర్‌ని కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

## 34 గ్రామాలు 3 మున్సిపాలిటీలు

### అర్బన్ జిల్లా గా మేడ్చల్

మేడ్చల్, మార్చి 16(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో మరో 3 మున్సిపాలిటీల ఏర్పాటు దాదాపుగా ఖారారు చేసేలా సర్కార్ చర్యలు చేపట్టింది. జిల్లాలో మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేటలను మున్సిపాలిటీల ఏర్పాటుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. బిల్లు ఆమోదం పొందితే మేడ్చల్ పూర్తిగా అర్బన్ జిల్లాగా మారుతుంది. జిల్లాలో ఉన్న 34 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల పరిధిలోకి మారుస్తున్న నేపథ్యంలో పంచాయతీల కార్యదర్శుల నుంచి జిల్లా అధికారులు బదిలీలపై అప్షన్లు కోరుతున్నారు. గ్రామ పంచాయతీల గ్రామ కార్యదర్శులుగా కొనసాగుతారా లేక మున్సిపాలిటీల్లో ఉంటారా గ్రామ పంచాయతీ గ్రామ కార్యదర్శులుగా కొనసాగాలంటే ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తారా అన్న విషయమై అప్షన్లకు తీసుకుంటున్నారు. దీంతో జిల్లాలో మరో 3 మూడు మున్సిపాలిటీలు ఖాయమైనట్లే.

### 34 గ్రామాలు..

ప్రస్తుతం మేడ్చల్ జిల్లాలో మూడు మేడ్చల్, మూడుచింతలపల్లి, శామీర్‌పేట మండలాలు ఉండగా, ఇందులో 34 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. ఎల్లంపేట మున్సిపాలిటీలో ఎల్లంపేట, శ్రీరంగవరం, బండ మాదారం, నూతన్‌కల్, మైసిరెడ్డిపల్లి, కొనాయిపల్లి, సోమారం, రావల్‌కల్, కండ్లకోయ, రాజబోల్లారం, ఘనాపూర్, గోసాయిగూడ అలియాబాద్ మున్సిపాలిటీలో అలియాబాద్, తుర్కపల్లి, లాల్‌గడి మలక్‌పేట, మజీద్‌పూర్, మురారిపల్లి, యాడారం, పొన్నాల మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో మూడు చింతలపల్లి మండలంలోని లింగాపూర్, ఉద్దమర్రి, కేశవరం, నాగిశేట్టిపల్లి, కోల్తూర్, నారాయణపూర్, పోతారం, అనంతరం, లక్ష్మాపూర్, అద్రాస్‌పల్లి, జగ్గంగూడ, కేశవాపూర్ గ్రామాలను విలీనం చేయనున్నారు. జిల్లాలో 61 గ్రామపంచాయతీలు, 5 గ్రామీణ మండలాలు ఉండేవి. వీటిలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల బయట ఉన్న 28 గ్రామాలను గతేడాది సెప్టెంబర్‌లో సమీపంలో ఉన్న 7 మున్సిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీంతో మిగిలిన 34 గ్రామ పంచాయతీలు మాత్రమే మిగలడంతో మరో 3 మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం మిగిలిన 34 గ్రామాలను విలీనం చేయాలని అధికారులు ప్రభుత్వానికి లేఖను సమర్పించారు. జిల్లా పూర్తిగా అర్బన్ ప్రాంతంగా మారనున్న నేపథ్యంలో జడ్పీ వ్యవస్థ కోల్పోనున్నది.

## జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణం



రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మియాపూర్: ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వివేకానంద నగర్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు ఆర్పీ కాలనీలో ఆదివారం నిరసన తెలిపారు. తొలుత అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి రోడ్డుపై బైఠాయించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేట్ రంగారావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తిన జగదీశ్ రెడ్డి ని కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేయడం దారుణమన్నారు. అనంతరం రవీంద్రభారతిలో మాజీ సీఎం కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలపై అలాగే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి బొమ్మలను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేయడాన్ని నిరసిస్తూ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గొట్టిముక్కల పెద్ద భాస్కర్ ,మాచర్ల భద్రయ్య,ఆంజనేయులు,బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారం ఆగమాగం



**వెంటాడుతున్న కరెంటు కష్టాలు**

**అలియాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో దాదాపు 6 సార్లు, 3 గంటలకు పైగా కరెంట్ కోత**

శామీర్‌పేట, మార్చి 16 : విచ్చల విడి కరెంట్ కోతలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అలియాబాద్ సబ్ స్టేషన్ సెక్షన్ పరిధిలోని సబ్ స్టేషన్లలో ఇదే పరిస్థితి కొనసాగడంతో ఆదివారం ఆగమాగంగా గడిచింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపుగా 6 సార్లు 3 గంటల పాటు విద్యుత్ కోతలు విధించారు. ముందస్తు సమాచారం లేకుండా కరెంట్ కట్ చేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఏఈ ని వివరణ కోరగా ఇన్ కమ్మింగ్‌లైన్ కట్ అవ్వడంతో మధ్యాహ్నం 1 గంటల నుంచి 2:36 వరకు మరమ్మతుల కోసం కొంత సమయం విద్యుత్ సరఫరా లో అంతరాయం కలిగిందని తెలిపారు.



### ప్రతి రోజూ కోతలే..

విద్యుత్ సరఫరాలో ప్రతి రోజూ కోతలే. ఉదయం 9 గంటల ప్రాంతంలో, మధ్యాహ్నం ఎప్పుడు పడితే అప్పుడే... ఎందుకు కరెంటు తీస్తున్నారో ఎవరికీ తెలియదు. బిల్లులు మాత్రం ముక్కుపిండి వసూలు చేసే కరెంటోళ్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం విషయం ముందే చెప్పడం తెలియకపోవడం విడ్డురం.

– శ్రీకాంత్, శామీర్‌పేట మండలం.



### కాంగ్రెస్ వచ్చింది..కష్టాలు తెచ్చింది..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. కరెంటు కష్టాలను తెచ్చింది. 200 యూనిట్లు ఫ్రీ విద్యుత్ ఏందో కాని ఎప్పుడు చూసినా కరెంటు కోతలే. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెప్పపాటునా.. కరెంటు పోనియ్యలేదు. కాంగ్రెస్ వచ్చిన నుంచి కరెంటు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి.

– ర్యాకల ఆనంద్‌గౌడ్, అలియాబాద్ గ్రామం.

## పేరు మార్చి గాలికొదిలేశారు..

### నాడు కేసీఆర్ కిట్ పేదలకు వరం..
### కాంగ్రెస్ పాలనలో లబ్ధిదారుల ఎదురుచూపులు

సిటీబ్యూరో/సుల్తాన్ బజార్, మార్చి 16,(నమస్తే తెలంగాణ): పదేండ్ల కాలంపాటు పేద ప్రజలకు వరమైన కేసీఆర్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నది. పనిగట్టుకొని మరీ వాటి పేర్లు మార్చడం తప్ప.. అమలు మాత్రం తూతూ మంత్రంగా చేస్తున్నది. కొన్ని పథకాలైతే కనిపించకుండా పోవడం గమనార్హం. అలాంటి పథకాల్లో ఒకటైన కేసీఆర్ కిట్ ను కాంగ్రెస్ సర్కారు మెటర్నల్ చైల్డ్ హెల్త్ స్కీం గా పేరు మార్చి ఆ పథకాన్ని నీరు గార్చింది.

### ఏడాదికాలంగా ఎదురుచూపు..

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు కేసీఆర్ కిట్ పేరును మార్చి ఎంసీహెచ్ స్కీం పేరుతో అమలు చేసింది. పథకం పేరు మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేయడంలో విఫలమైంది. 2024 ఫిబ్రవరి నుంచి నేటి వరకు ఎంసీహెచ్ కిట్లు నిలిపేయడంతో లబ్ధిదారులంతా ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ఇస్తామన్న ఎంసీహెచ్ కిట్ కోసం ఏడాది కాలంగా నిరాశతో ఎదురుచూస్తున్నారు.

**కింగ్‌కోటీలోని మెటర్నిటీ వైద్యశాలలో 2024 ఏడాది నుంచి జనవరి వరకు నమోదైన డెలివరీ కేసుల వివరాలివీ**

| నెల | ఔట్ పేషెంట్లు | ఇన్ పేషెంట్లు | సాధారణ ప్రసవం | సిజేరియన్ |
|---|---|---|---|---|
| జనవరి | 7100 | 1193 | 418 | 457 |
| ఫిబ్రవరి | 6755 | 1298 | 442 | 399 |
| మార్చి | 7467 | 1250 | 482 | 456 |
| ఏప్రిల్ | 7520 | 1368 | 500 | 491 |
| మే | 7700 | 1294 | 528 | 496 |
| జూన్ | 7263 | 1250 | 433 | 423 |
| జులై | 8663 | 1331 | 529 | 464 |
| ఆగస్టు | 6364 | 1295 | 545 | 490 |
| సెప్టెంబర్ | 6444 | 1364 | 546 | 472 |
| అక్టోబర్ | 7233 | 1351 | 560 | 562 |
| నవంబర్ | 7637 | 1327 | 484 | 511 |
| డిసెంబర్ | 7182 | 1134 | 485 | 454 |
| జనవరి-2025 | 6992 | 1669 | 455 | 485 |



**2017 నుంచి 2024 వరకు ప్రభుత్వ మెటర్నిటీ వైద్యశాలలో కేసీఆర్ కిట్(ఎంసీహెచ్ కిట్) వివరాలు..**

| సంవత్సరం | డెలవరీలు | పంపిణీ చేసిన కిట్లు |
|---|---|---|
| 2017 | 5478 | 4692 |
| 2018 | 12559 | 9799 |
| 2019 | 11961 | 10100 |
| 2020 | 13682 | 10191 |
| 2021 | 12206 | 9308 |
| 2022 | 11477 | 8943 |
| 2023 | 11840 | 8968 |
| 2024 | 2654 | 1243 |